క్లుప్తంగా

'ఉన్నతి, తొలిమెట్టు'ను రద్దు చేయాలి


మీనాజీపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

వర్గల్(గజ్వేల్): పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠాలు బోధించే క్రమంలో ఉపాధ్యాయులకు తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలు తీవ్రభారంగా మారాయన్నారు. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పర్వతం నర్సయ్య, పిల్లి రాములు, నాయకులు కృష్ణ, నర్సింగరావు, హరిబాబు, నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రమాదం తప్పింది. మండలంలోని మందాపూర్‌కు చెందిన పలువురు విద్యార్థులు మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. రోజువారీలాగే శుక్రవారం ఉదయం పాఠశాలకు ఆటోలో 12 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తుండగా రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో నుంచి పలువురు విద్యార్థులు ఎగిరి కిందపడ్డారు. స్వల్ప గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం గజ్వేల్‌కు తరలించారు.

'ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రజలకిచ్చిన హామీలను అన్నింటిని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి కరుణాకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలుచేసి తీరుతామన్నారు. ప్రజల అపోహ పడొద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి(సిద్దిపేట): ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో గల సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చేర్యాల ఏఈ కనకయ్య శుక్రవారం తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

రైతులకు అవగాహన

నంగునూరు(సిద్దిపేట): భూమిలో పేరుకుపోయిన రసాయన అవశేషాలను కళ్లబెట్టడంతో పాటు భూమిని సారవంతం చేయడం ద్వారా వేస్ట్ డీ కంపోజర్ అద్భుతంగా పని చేస్తుందని ములుగు వ్యవసాయ ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ వినోద్‌కుమార్, రిటైర్డ్ శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్ అన్నారు. ముండ్రాయిలో వేస్ట్ డీ కంపోజర్ ఉపయోగించి పట్టు సాగు చేస్తున్న రైతు రాజు వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను మేతగా వేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పట్టు సాగులో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్ సునిత, పట్టుపరిశ్రమ అధికారి ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గౌరవెల్లి' కుడి కాలువ పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువను డీఆర్డీఓ జగదేవ్, ఏపీడీఓ ఓబులాష్ శుక్రవారం పరిశీలించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కింద ఉన్న కుడి కాలువ తూము నుంచి కట్కూర్ వరకు ఉన్న కాలువను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలువలో పెరిగిన తుమ్మ, ముళ్ల చెట్లు, పూడిక తదితర వాటిని ఉపాధి హామీ కూలీలతో తొలగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ కల్లును నిరోధించండి

- మిరుదొడ్డి మండల సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్
- ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆగ్రహం



ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు

మిరుదొడ్డి(దుబ్బాక): విచ్చలవిడిగా విక్రయిస్తున్న కల్తీ కల్లును నిరోధించడంలో ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గజ్జెల సాయిలు అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ హాజరుకాకుండా కేవలం కింది స్థాయి అధికారులను పంపించడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా గ్రామాల్లో కల్తీ కల్లు విక్రయిస్తున్నారని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఉమ్మడి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజుతో పాటు అక్బర్‌పేట- భూంపల్లి, మిరుదొడ్డి మండల పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లు మండిపడ్డారు. సీసాల్లో కాకుండా పాలిథిన్ కవర్లలో కల్లును సరఫరా చేస్తుండడంతో పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల కల్తీ కల్లు సేవించిన కొందరు ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇళ్ల మధ్య నిర్వహిస్తున్న కల్లు దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని ఎక్సైజ్ అధికారులు హామీ ఇచ్చారు. అల్వాల మీదుగా లింగుపల్లి చెరువు వరకు ఉన్న ఫీడర్ చానల్‌కు మరమ్మతులు చేయాలని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు కోరారు. మిరుదొడ్డి పంచాయతీ కార్యాలయంలో వివిధ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరుగుతున్నాయని మిరుదొడ్డి ఎంపీటీసీ- 1 నర్సింహులు సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ గజ్జెల సాయిలు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు అధికారులు సమష్టిగా కృషి చేసి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంఈఓ జోగు ప్రభుదాసు, కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలను చేపట్టిన లింగాల రాజలింగారెడ్డిని మండల సర్వ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సమన్వయంతో పనిచేయాలి

మర్కూక్(గజ్వేల్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ పాండుగౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కూక్‌లోని ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో మండల సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏఓ నాగేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పాండుగౌడ్

పారపట్టి.. మురికి కాలువ శుభ్రం చేసి..


మురికి కాలువ శుభ్రం చేస్తున్న కౌన్సిలర్ సులోచన, కోఆప్షన్ మెంబర్ స్వామి దంపతులు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మురికి కాలువలు చెత్తా చెదారంతో నిండి అధ్వానంగా మారాయని.. ఎన్నిసార్లు చెప్పిన మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని 13వ వార్డు కౌన్సిలర్ ఆస సులోచన, కోఆప్షన్ మెంబర్ స్వామి దంపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనగా శుక్రవారం వారే స్వయంగా పార పట్టి మురికి కాలువలను శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరారు.

ఆదర్శంగా మారిన గ్రామాలు


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవీ

- ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు

సిద్దిపేటరూరల్: గ్రామాలు ఆదర్శంగా మారాయని ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు శాఖల వారీగా సాధించిన ప్రగతి నివేదికలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌లు విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందని.. ప్రభుత్వం మాఫీ చేసే వరకు కట్టబోమన్నారు. కోతులు, అడవి పందుల ఇబ్బంది తీవ్రంగా ఉందని, పరిష్కరించేలా చూడాలని అటవీశాఖ అధికారులను కోరారు. రావురుకులలో నీటి ట్యాంక్ లీకేజీ ఉందని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బస్సులు ప్రజలకు అందుబాటులో లేవని పేర్కొన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో గత ఐదేళ్లుగా మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పదవిలో ఉంటూ గ్రామంలో ఎదుర్కొన్న ఇబ్బందులను పంచుకుంటూ భావోద్వేగాలకు లోనయ్యారు. అనంతరం ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు మాట్లాడుతూ.. సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి, ఎమ్మార్వో, ఎంపీఓ శ్రీహరి, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా 'పంబ ఆరట్టు'


అయ్యప్ప స్వాముల శోభాయాత్ర


ఉత్సవ విగ్రహాలతో అయ్యప్ప భక్తులు

హుస్నాబాద్: పట్టణంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పంబ ఆరట్టు ఉత్సవ యాత్ర వైభోపేతంగా నిర్వహించారు. పుర వీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి మల్లెచెట్టు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఎల్లమ్మ చెరువు వరకు దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. అడుగడుగున మహిళలు మంగళహారతలు పట్టారు. గురుస్వాములతో కలిసి కన్నె స్వాములు నృత్యాలు చేశారు. ఎల్లమ్మ చెరువులో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ వెంకట్, ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి వెంకట రమణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుద్దాం


ట్రై సైకిళ్లతో దివ్యాంగులు

గజ్వేల్‌రూరల్: దివ్యాంగులకు అండగా నిలిచి వారిలో మనోధైర్యం కల్పిద్దామని తెలంగాణ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు వంశీరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మురళీకృష్ణాలయంలో శుక్రవారం 15 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను చిన్న చూపు చూడొద్దని, వారిలో మనోస్థైర్యం నింపుతూ ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. ఈసందర్భంగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు సురేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కవితారెడ్డి, ఫిజియోథెరపిస్ట్ గీత, నాయకులు దేవేందర్‌రెడ్డి, పర్శరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న న్యాక్ బృందం రాక

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఈ నెల 18, 19 తేదీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు ఏ గ్రేడ్ సాధించామని, ఈ సారి ఏ 2ప్లస్ గ్రేడ్ సాధించడమే లక్ష్యం అని చెప్పారు. న్యాక్ బృందం రెండు రోజులపాటు కళాశాలను సందర్శించి వసతులు, పర్యావరణ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేసి గ్రేడ్‌ను ప్రకటించనున్నట్లు తెలిపారు.

పుస్తెలతాడు అపహరణ

కొండపాక(గజ్వేల్): వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడు ఎత్తుకెళ్లినట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లికి చెందిన బాలమణి శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని కాలి నడకన ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐక్యంగా ఉద్యమిద్దాం

సిద్దిపేట కమాన్: మాదిగ రిజర్వేషన్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలోని ప్రెస్‌క్లబ్ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగ జాతి చేస్తున్న ఉద్యమం కీలక దశకు చేరిందన్నారు. ఈసమయంలో జాతి భవిష్యత్ కోసం మాదిగలు అంతా ఏకం అయి ఉద్యమం వైపు కదలాలన్నారు. ఈనెల 17 నుంచి జిల్లాలోని ప్రతి మండలంలో మండల కమిటీలు ఎన్నుకొని గ్రామస్థాయిలో కమిటీని నిర్మాణం చేసి ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జెర్రిపోతుల లత, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెబర్తి యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్, ఎంఎస్‌పీ సిద్దిపేట అసెంబ్లీ ఇంచార్జి పెర్క పర్శరాములు, నాయకులు కొలిమి మల్లేష్, సుంచు రమేష్, పవన్ కళ్యాణ్, అంజి, రమేష్, మహేష్, భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి

సీతక్కను కలిసిన నాయకులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను తొగుట మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలిసిన ప్రజాప్రతినిధిగా మెరుగైన సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో తొగుట ఎంపీపీ గాంధారి లతా నరేందర్‌రెడ్డి, తొగుట సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి, టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

స్వచ్ఛ పల్లెలుగా మార్చాలి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: పల్లెలను స్వచ్ఛతగా మార్చేందుకు ప్రతి శుక్రవారం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని, మురికి కాల్వలో చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మీర్జాపూర్, జిల్లెలగడ్డ, పందిల్ల, పోతారం(ఎస్) గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లావుడ్య స్వరూప, తరాల లత, బత్తిని సాయిలు, తోడేటి రమేశ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రంగోత్సవంలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని జీడీఆర్ పాఠశాలలో నిర్వహించిన రంగోత్సవం పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. సెప్టెంబర్ 6వ తేదీన పాఠశాలలో నిర్వహించిన కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కార్టూన్ మేకింగ్, టాటూ మేకింగ్, గ్రీటింగ్ కార్డ్ మేకింగ్, స్కెచింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో 66 మంది తమ ప్రతిభను చాటి అంతర్జాతీయ ఆర్ట్ కాంపిటీషన్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు విజయలక్ష్మీ, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్‌కు చెందిన దయ్యాల రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించగా గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

◆ హిందువాహిని నగర కమిటీ ఎన్నిక



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందువాహిని సిద్దిపేట నగర కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బస్వరాజు సత్యం ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడిగా లక్ష్మణ్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మెరుగు అజయ్, నవీన్, మహేష్‌రెడ్డిని కార్యవర్గ సభ్యులుగా భానుప్రకాశ్, శ్రీనివాస్, సదన్‌రెడ్డి, సుమంత్, నంద కైలాస్, శంకర్, లాలు ప్రసాద్, ప్రదీప్, సుజయ్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండికిరణ్ కుమార్, జిల్లా అడ్వకేట్ ప్రముఖ్ ప్రదీప్‌కుమార్, కార్యాలయ ప్రముఖ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ డిప్యూటీ సీఎంను కలిసిన 'గాడిపల్లి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, లింగం, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నట్టు చెప్పారు.

◆ విద్యార్థి కుటుంబానికి అండగా..



చేర్యాల(సిద్దిపేట): మండలంలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న గుమ్మి లోకేష్ తండ్రి యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించి రూ. 6 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, రామకిషన్, నవిత, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలకృష్ణ, శారద, ప్రశాంత్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట కమాన్: ఈనెల 21న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ఎల్లం, జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవులపల్లి రాజేందర్, సీనియర్ నాయకులు గుడికందుల ఎల్లం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ వైన్‌షాపును తొలగించండి

సిద్దిపేట కమాన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న లిక్కర్ మార్ట్‌ను కళాశాల పరిసరాల నుంచి తొలగించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్‌వర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మద్యం షాప్ ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. వెంటనే లిక్కర్ మార్ట్ స్థలాన్ని మార్చాలని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్, పర్శరాం, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

